సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 14, అక్టోబర్, 2024



ఇస్కాన్‌లో రావణ వధ

విశాఖ నగరంలోని ఇస్కాన్ మందిరంలో దసరా వేడుకల్లో భాగంగా రావణ దహనం నిర్వహించారు.

8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు.

8లో



ఘనంగా సామూహిక దీపారాధన

విశాఖ: చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం రాత్రి సామూహిక దీపారాధన ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

పర్యాటక ప్రాంతాలు మూసివేత


రంపచోడవరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలను మూసివేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను అనుమతించడమని వారు పేర్కొన్నారు. వర్షాలకు కొండ కాలువలు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

నేటి నుంచి పల్లె పండగ

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఈనెల 14వతేదీ సోమవారం నుంచి పల్లెపండగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి గత ఆగస్టు 23న జిల్లాలోని 430 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని తెలిపారు. ఆయా సభల్లో తీర్మానించిన 900కు పైగా అభివృద్ధి పనులకు రూ.413 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. వీటిని ప్రారంభించేందుకు పల్లెపండగను వారం రోజుల పాటు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రమాద స్థాయిలో పెద్దేరు నీటిమట్టం



పెద్దేరు జలాశయం నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద నీరు

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవడంతో జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. రెండు రోజుల కిందట 150 క్యూసెక్కుల ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం ఉదయానికి 310 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమై ప్రధాన గేటుద్వారా 300 క్యూసెక్కులను పెద్దేరు నదిలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.70 మీటర్లకు చేరుకుంది.



ప్రారంభానికి సిద్ధమైన పాడేరు వైద్య కళాశాల ప్రధాన భవనం

జగనన్న సంకల్పం.. నేడు సాకారం



సిద్ధమైన తరగతి గది

● పాడేరులో వైద్య కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి ● 50 సీట్లతో అందుబాటులో వైద్య విద్య

గిరిజనులకు మంచి చేయాలన్న సంకల్పంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు పేరిట పాడేరు కేంద్రంగా గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి పాలనను మరింత చేరువ చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందుబాటులోకి తెచ్చారు. గిరిజనులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, యువతకు వైద్య విద్య అందుబాటులోకి తేవాలన్న ఆయన ఆశయం సాకారమయ్యేవేళ ఆసన్నమైంది. పాడేరులో రూ.500 కోట్లతో గత ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాల సోమవారం ప్రారంభం కానుండటంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది.

సాక్షి,పాడేరు: స్వాతంత్య్రం సిద్ధించిన నాటి నుంచి ఉన్నతవైద్యం అంటే తెలియని గిరిజనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం న్యాయం చేసింది. 2019 ఎన్నికల ప్రచారానికి పాడేరు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అధికారంలోకి రాగానే ఇక్కడ వైద్య కళాశాలను ఏర్పాటుచేసి వైద్య విద్యతోపాటు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారం చేపట్టిన వెంటనే రూ.500 కోట్లతో వైద్య కళాశాలను మంజూరు చేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో 35ఎకరాల విస్తీర్ణంలో మూడు బ్లాక్‌ల్లో వైద్య కళాశాల భవన నిర్మాణం గత ప్రభుత్వం చేపట్టింది.

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు..

పాడేరు మెడికల్ కళాశాలలో 50 సీట్లతో వైద్యవిద్య ప్రారంభానికి జాతీయ మెడికల్ కౌన్సిల్ గత నెల అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకు 42మంది విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొందగా, మరో 8మంది చేరాల్సి ఉందని ఆమె తెలిపారు.

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

సోమవారం నుంచి వైద్యవిద్యను ప్రారంభించాలని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో తరగతుల నిర్వహణకు అవసరమైన భవనాలతోపాటు హాస్టల్ బ్లాక్‌ను అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసింది.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

వైద్య కళాశాల ప్రారంభ ఏర్పాట్లపై కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. తరచూ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నాణ్యతలో లోపాలను సహించేది లేదని హెచ్చరించారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు జాగ్రత్త వహించారు. తరగతులు నిర్వహించే బ్లాక్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారు.

- వైద్య కళాశాలకు సంబంధించి ఫ్యాకల్టీలో 70 శాతం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నియమించింది. పాలిటెక్నిక్ సమీపంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి అయ్యేందుకు మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రిలోనే రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఈ ఏడాది జనవరిలో సుమారు రూ.2కోట్లతో జిల్లా సర్వజన ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసింది.
- వైద్య కళాశాలను దృష్టిలో పెట్టుకుని 420 పడకలు అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని పరిశీలించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య కళాశాలకు అనుబంధంగా సేవలందించడం వల్ల గిరిజనులకు ఉన్నత వైద్యం అందనుంది.

కళాశాలలో సీట్ల వివరాలు

మొత్తం	:	50
చేరిన వారు	:	42
రాష్ట్ర కోటా	:	20
ఎన్ఆర్ఐ కోటా	:	4
సెల్ఫ్ ఫైనాన్స్	:	14
అలిండియా కోటా	:	4

తల్లిదండ్రులతో వచ్చా



పాడేరు వైద్య కళాశాలలో సీటు రావడం అదృష్టంగా భావిస్తున్నా. కొత్త కళాశాల వ్యూ, తరగతులు, హాస్టలు నిర్వహించే బ్లాక్‌లను ఆకర్షణీయంగా నిర్మించారు. ఆహ్లాదకరంగా ఉండే గిరిజన ప్రాంతంలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– కె.భావన, వైద్య విద్యార్థి,గుంటూరు

కార్పొరేట్ స్థాయిలో భవనాలు



కొత్తగా నిర్మించిన పాడేరు వైద్య కళాశాల కొత్త భవనం బాగుంది.అన్ని సౌకర్యాలతో అందంగా నిర్మించారు.అన్ని బ్లాక్‌లు పరిశీలించారు. కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు.ఇక్కడ వాతావరణం కూడా నచ్చింది.తరగతులు ప్రారంభమవుతుండడం ఎంతో సంతోషంగా ఉంది.

– పి.దిలీప్‌రెడ్డి, వైద్య విద్యార్థి, వైఎస్సార్ కడప

ఘనంగా దసరా వేడుకలు



అమ్మవారిని దర్శించుకున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులు

ముంచంగిపుట్టు: మండలంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, నరసింహమూర్తి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మురిసిన పర్యాటకం

- భారీగా తరలివచ్చిన సందర్శకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: దసరా సందర్భంగా వరుస సెలవులు కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చారు. వంజంగి హిల్స్‌లో పొగమంచు, సూర్యోదయం అందాలను తిలకించారు.

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు సాయికుమార్



సింహాచలం (విశాఖ): శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం సినీ నటుడు సాయికుమార్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

ఘనంగా ముగిసిన శరన్నవరాత్రులు



పాడేరులో ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో అమ్మవారి ఊరేగింపు



కిండంగి గ్రామంలో నిమజ్జనం సందర్భంగా కనకదుర్గ విగ్రహం ఊరేగింపు



ధారాలమ్మ తల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు దేవతామూర్తులను రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. విజయదశమి పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ధారకొండ ఘాట్‌లోని ధారాలమ్మ, చింతపల్లిలోని ముత్యాలమ్మ, పాడేరులోని మోదకొండమ్మ, చింతపల్లి ఘాట్‌లోని బోడకొండమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. అరకులోయలోని భ్రమరాంబదేవి, పాడేరులోని రాజరాజేశ్వరి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో కొలువుదీరిన దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా పాడేరు పురవీధుల్లో ఊరేగించి చిలకలమామిడి గెడ్డలో నిమజ్జనం చేశారు.

కందిరీగల దాడిలో చిన్నారి మృతి

- అన్నకు తీవ్ర గాయాలు
- కన్నీరుమున్నీరైన బంధువులు
- వై.కంఠవరంలో ఘటన



గౌరి మృతదేహాన్ని ఎత్తుకుని ఏడుస్తున్న కుటుంబ సభ్యురాలు



కందిరీగల దాడిలో గాయపడిన వంతాల విశ్వం

పెదబయలు: మండలంలోని జామిగుడ పంచాయతీ వై.కంఠవరంలో కందిరీగల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి వంతాల గౌరి (4) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వంతాల బొజ్జయ్య, టిక్కో దంపతులకు గౌరి, విశ్వం ఇద్దరు సంతానం.అన్నాచెల్లెలైన వారిద్దరు ఆదివారం ఉదయం గ్రా మ సమీపంలో ఆడుకుంటున్నారు. ఈ సమయంలో కందిరీగల గుంపు వారిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన వారు అరవడంతో వరసకు మేనమామ కిలో రాజేష్ అక్కడికి వెళ్లాడు. కందిరీగల గుంపునుంచి రక్షించి ఇంటికి తీసుకువచ్చాడు. వీరిద్దరిలో తీవ్రంగా గాయపడిన గౌరి పరిస్థితి విషమించింది. వెంటనే రూడకోట పీహెచ్‌సీ అంబులెన్సుకు తండ్రి ఫోన్ చేశాడు. డీజిల్‌కోసం పాడేరు వెళ్లినందున వెంటనే రావడానికి సాధ్యం కాదని డ్రైవర్ మోహన్‌రావు తెలిపాడు. ఏదైనా వాహనంలో తీసుకువస్తే మార్గం మధ్యలో వాళ్లను పికప్ చేసుకుంటానని చెప్పాడు. దీంతో వెంటనే తండ్రి జామిగుడ వెళ్లి ప్రైవేట్ వాహనాన్ని తీసుకువచ్చాడు. వారిద్దరిని ఆ వాహనంలో రూడకోట పీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం వారిని వైద్యసిబ్బంది సిఫార్సు మేరకు ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి అదే వాహనంలో తీసుకువెళ్లారు. అక్కడ ఇద్దరిని పరీక్షించిన వైద్యులు అప్పటికే గౌరి మృతి చెందినట్టు నిర్ధారించారు. అన్న విశ్వంకు తక్షణ వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

మిన్నంటిన రోదనలు

చిన్నారి గౌరి మృతితో తల్లిదండ్రుల రోదన వద్ద మిన్నంటాయి. అక్కడ ఉన్న వారందరినీ కలిచివేశాయి. అంబులెన్సు సకాలంలో వచ్చి ఉంటే ప్రాణాలు నిలిచేవని వారు రోదించారు. దీనిపై రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా ఆదివారం కావడంతో డ్యూటీలో ఉన్న స్టాఫ్‌నర్స్ ఇద్దరికి ప్రాథమిక చికిత్స అందించి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి రిఫర్ చేశారన్నారు.


అనుమానమే పెనుభూతమై..

- భార్యను అతికిరాతకంగా హతమార్చిన భర్త
- గన్నేరుపుట్టులో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఘటన స్థలంలో రక్తపు మడుగులో పడి ఉన్న కిముడు లబ్బ మృతదేహం

హుకుంపేట: అనుమానం పెనుభూతమై ఓ వివాహిత నిండు ప్రాణాన్ని బలిగొంది. మండలంలోని గన్నేరుపుట్టులో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని నందపూర్ గ్రామానికి చెందిన కిముడు పనో, భార్య లబ్బతో రెండేళ్ల నుంచి గన్నేరుపుట్టులో నివాసం ఉంటున్నాడు. వారిరువురు ఇక్కడే కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలా సాఫీగా సాగుతున్న ఆ కుటుంబంలో అనుమానం చిచ్చు రేపింది. వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో పనో తరచూ భార్యను వేధించేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇంటివద్ద ఉన్న భార్యను మెడపై కత్తితో విచక్షణా రహితంగా నరికేశాడు. అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన భార్య లబ్బ అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితుడు పనోను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు.





వావ్.. వల్లాయి..!

ప్రకృతి అందాలకు నిలయమైన జిల్లాలో అబ్బురపరిచే ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా పాడేరుకు 15 కిలోమీటర్ల దూరంలోని బడిమెల పంచాయతీ వల్లాయి ప్రాంతంలో మరో ప్రదేశం వెలుగుచూసింది. ఈ ప్రాంతంలో గిరులు విశ్వవ్యాప్తి పొందిన వంజంగి మేఘాల కొండను తలపిస్తున్నాయి. మేఘాలు, పొగమంచు, సూర్యోదయ అందాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఉండటంతో పర్యాటకులు ఇక్కడి అందాలను తిలకించేందుకు క్యూ కడుతున్నారు

– సాక్షి, పాడేరు

క్లుప్తంగా

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ఎటపాక: కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. మండలంలోని కృష్ణవరం వాగు సమీపంలో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో సీఐ కన్నపరాజు, ఎస్సై కే పార్థసారధి తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పందేలాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.3,200 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

అడ్డతీగల: మండలంలోని డి.భీమవరంలో చెక్కా అప్పారెడ్డి తలపై శనివారం అదే గ్రామానికి చెందిన ఐదుగురు దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.వినోద్ తెలిపారు. దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇస్కాన్‌లో రావణ వధ

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్‌లో దసరా వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. ముందుగా ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర బలభద్రులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి రామ కళామృతం, రామ గానామృతం అనంతరం సాయంత్రం రావణ దహనం చేశారు. 50 అడుగుల రావణుడి బొమ్మను ఏర్పాటు చేసి దహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫైర్ క్రాకర్ షో, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో మహాన్నదానం జరిపారు.

పాము కాటుతో రైతు మృతి



సన్యాసిరావు మృతదేహం

యలమంచిలి రూరల్: పొలంలో యూరియా జల్లుతుండగా పాము కాటువేయడంతో ఓ రైతు మృతి చెందాడు. పట్టణంలోని ధర్మవరం వీధికి చెందిన కౌలు రైతు కొలపాటి సన్యాసిరావు(53) ఆదివారం స్థానిక కల్కి పెట్రోల్ బంక్‌కు ఎదురుగా ఉన్న తన వరిపొలంలో యూరియా జల్లుతుండగా కాలిపై పాము కాటు వేసింది. విషయం తెలుసుకుని సన్యాసిరావును యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడికి భార్య,కుమార్తె,కుమారుడు ఉన్నారు. సన్యాసిరావు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పండగ వేళ చోటుచేసుకున్న ఈ ఘటనతో ధర్మవరం వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అప్పన్న జమ్మివేట ఉత్సవం

- రామాలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న
- శాస్త్రోక్తంగా శమీపూజ



పూలతోటలో జమ్మి చెట్టు వద్ద శమీపూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న దేవస్థానం ఈవో త్రినాథరావు



పూలతోటలోని మండపంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జమ్మివేట ఉత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రాముడిగా అలంకరించి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండ దిగువకి తీసుకొచ్చారు. కొండ దిగువ తొలిపావంచా వద్ద దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అధికారులు, అడవివరం గ్రామస్తులు స్వామికి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామి వారిని పూలతోటలోకి విహారానికి తీసుకెళ్లారు. పూలతోటలో ఉన్న ప్రధాన మండపంలో అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు, వేద పారాయణాలు, పంచశూక్త పారాయణాలను నిర్వహించారు. పూలతోటలో శమీ వృక్షం చెంత విశేష పూజలు జరిపారు. శమీ దళాలను కోసి స్వామికి సమర్పించారు. విశేషంగా అర్చన చేశారు. అనంతరం స్వామిని అశ్వ వాహనంపై కొలువుదీర్చి, అడవివరం పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామి వారికి గ్రామస్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మళ్లీ కొండపైకి స్వామిని తీసుకెళ్లారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు తదితరులు ఉత్సవాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, పూర్వ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ సంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని న్యాయవాది దుర్మరణం



ఉలిమిరి రామశాస్త్రి(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం బస్ స్టాప్ వద్ద ద్విచక్రవాహనం ఢీ కొని న్యాయవాది మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. నాతయ్యపాలెంలో నివాసం ఉంటున్న న్యాయవాది ఉలిమిరి రామశాస్త్రి (55) శనివారం రాత్రి భోజనం చేసి నాతయ్యపాలెం బస్ స్టాప్ వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిని దర్శించుకోవడానికి వచ్చారు. అమ్మవారిని చూసి మండపం నుంచి తిరిగి ఆయన ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చాడు. ఈ సమయంలో గాజువాక వైపు నుంచి షీలానగర్ వైపు ద్విచక్రవాహంపై వెళ్తున్న వ్యక్తి రామశాస్త్రిని ఢీ కొట్టాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయం అయ్యింది. వెంటనే అక్కడ ఉన్న వారు 108కు సమాచారం అందించారు. సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా దిచక్రవాహనం నడుపుతున్న మధురవాడకు చెందిన వ్యక్తి పడిపోవడంతో గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బృతుడు రామశాస్త్రికి భార్య సంధ్య, వివాహమైన కుమార్తె సాయి కుమారి, కుమారుడు అరుణ్ కుమార్ ఉన్నారు.

రేపటి నుంచి ఎస్జీఎఫ్ ఉమ్మడి విశాఖ క్రీడా పోటీలు

- ఎంపికైన క్రీడాకారులు, జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ నెల 15న అండర్-14 బాలురు, బాలికల క్రికెట్ పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో, అదేరోజు అండర్-14, 17(బాలురు, బాలికల) విభాగంలో ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు గోవాడ జెడ్పీ హైస్కూల్లో జరపనున్నట్లు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు.

- 16న బ్యాడ్మింటన్ ఎంపికలు అండర్ 14, 17 విభాగాల్లో ఇండోర్ స్టేడియం గోపాలపట్నంలోను, కబడ్డీ అండర్ 14 ఎంపికలు జెడ్పీ హైస్కూల్ వేములపూడి, అండర్ 14, 17 ఆర్చరీ పోటీలు అరకు స్పోర్ట్స్ స్కూల్, ఫుట్‌బాల్ అండర్ 14, తాక్రా అండర్-14, 17 ఎంపిక పోటీలు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుపనున్నారు.
- 17న బాస్కెట్ బాల్ అండర్ 14, 17 పోటీలు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సీతమ్మధార, హాకీ అండర్ 14 పోటీలు జెడ్పీ హైస్కూల్ నక్కపల్లి, అండర్ 14 ఖోఖో పోటీలు జెడ్పీ హైస్కూల్ అచ్యుతాపురంలో నిర్వహించనున్నారు.
- 18న కబడ్డీ అండర్ 17 పోటీలు జెడ్పీ హైస్కూల్ కూండ్రం, క్రికెట్ అండర్ 17 పీఎంపాలెంలోని వీడీసీఏ మైదానంలో నిర్వహించనున్నారు.
- 19న ఖోఖో అండర్ 17 పోటీలను జెడ్పీ హైస్కూల్ తుమ్మపాల, అండర్ 14, 17 చెస్ పోటీలు అనకాపల్లి జీవీఎంసీ మెయిన్ స్కూల్ సారథ్యంలో ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో, హాకీ అండర్ 17 పోటీలు విశాఖలోని ఏయూ మైదానంలో, అండర్ 14, 17 లాన్ టెన్నిస్ పోటీలు విశాఖలో జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.
- 20న అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్, అండర్ 14,17 పవర్ లిఫ్టింగ్ పోటీలు జెడ్పీ హైస్కూల్ చెట్టిపల్లిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించి విద్యార్థులు, అర్హత పత్రాలతో హాజరు కావాల్సిందిగా కోరారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం



గొండొలులో డ్రగ్స్ ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐ నరసింహమూర్తి,ఎస్ఐ వినోద్



రంగినిగూడ గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర



జి.ఎం కొత్తూరు జంక్షన్ వద్ద యువత, టూరిస్టులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు



దూసరపాము గ్రామంలో వివరిస్తున్న ఎస్సై నరసింహమూర్తి

అడ్డతీగల: గంజాయి సాగుతోపాటు క్రయ విక్రయాలు చట్టరీత్యా నేరమని సీఐ నరసింహమూర్తి హెచ్చరించారు. మండలంలోని గొండోలులో డ్రగ్స్ ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను అక్కడి ప్రజలకు వివరించారు. వ్యవసాయ భూముల్లో అడవి జంతువుల వేట కోసం విద్యుత్ వైర్లు ఏ ఒక్కరూ అమర్చవద్దన్నారు. వీటిని ఎవరైనా తాకితే విలువైన ప్రాణాలు పోతున్నాయన్నారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ బి.వినోద్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఏవోబీ సరిహద్దు గ్రామాల్లో గిరిజనులు గంజాయి సాగు, రవాణా జోలికి పోవద్దని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. మండలంలో అత్యంత మారుమూల ప్రాంతాలైన బుంగాపుట్టు పంచాయతీ రంగినిగూడ, చుట్టుగొంది గ్రామాల్లో ఆదివారం పోలీసులు డ్రోన్‌తో వీడియోలు, ఫొటోలు తీసి, గంజాయి సాగుపై తనిఖీలు చేశారు. అనంతరం గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, నిరంతరం గంజాయిపై పోలీసు నిఘా ఉంచామన్నారు. ముఖ్యంగా పలువురు గిరిజన యువత గంజాయి రవాణాలో పట్టుబడుతున్నారని, వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. ప్రస్తుతం మహిళలు సైతం గంజాయి రవాణాలో పట్టుబడుతుండటంపై విచారం వ్యక్తం చేశారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే భవిష్యత్తు చిత్తు

జి.మాడుగుల: సరదా కోసం డ్రగ్స్ అలవాటు చేసుకుని బానిసైన ఎంతోమంది విద్యార్థులు తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారని ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. మండలంలో బందవీధి, సంతబయలు, జి.ఎం. కొత్తూరు, జి.మాడుగుల గ్రామాల్లో ఆదివారం గిరిజన విద్యార్థులు, ప్రజలు, టూరిస్టులకు 'సంకల్పం' కార్యక్రమంపై ఆయన అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వేదికగా లేనిపోని ఆశలు కల్పించి లావాదేవీలు జరిపి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆల్కహాల్ సేవించటం వల్ల కలిగే నష్టాలు, కుటుంబాలు ఆర్థికంగా ఎంత నష్టపోతున్నాయో ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. గంజాయి, రవాణా సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దని, అటువంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు.

డ్రగ్స్ ప్రభావంపై అవగాహన

రాజవొమ్మంగి: మాదకద్రవ్యాల వినియోగం అనర్థదాయకంపై ఆదివారం దూసరపాములో ఎస్సై నరసింహమూర్తి అవగాహన కల్పించారు. గంజాయి రవాణా చేసినా, సాగు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉన్నామన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు అటవీ ప్రాంతంలో పొలాల్లో, జీడిమామిడి తోటల్లో విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసిన వారిపై నిఘా పెట్టామన్నారు. వేటగాళ్లపై చర్యలు ఉంటాయన్నారు. ఇదే తరహాలో జడ్డంగిలో సీఐ సన్యాసినాయుడు, ఎస్సై చినబాబు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు

- నేడు భారత నాస్తిక సమాజం నివాళి

మహారాణిపేట: ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం అణగారిన ప్రజానీకానికి, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. దాదాపు 90 శాతం అంగ వైకల్యం ఉన్నప్పటికీ అణగారిన, ఆదివాసీ ప్రజల హక్కుల కోసం తన జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి సాయిబాబా అని కొనియాడారు. ఏ నేరం చేయకుండానే తొమ్మిదేళ్ల కారాగార శిక్ష అనుభవించిన ఉద్యమ నాయకుడని పేర్కొన్నారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా, ప్రజలకు పరిపాలనా సౌలభ్యం చేరువ కావాలని, ఆదివాసీల ఆధీనంలోని భూమిలో ఉన్న ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే కేంద్ర ప్రభుత్వ పన్నాగాలను బయట పెట్టినందుకే ఆయన్ని జైలు పాలు చేశారని ఆరోపించారు. చివరికి కోర్టు నిర్దోషిగా విడుదల చేసినా, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కడదాకా పోరాడిన వ్యక్తి సాయిబాబా అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పట్టపగలే ఇల్లు దోచేశారు..!

-9 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ



మంచంపై చెల్లాచెదరుగా పడి ఉన్న వస్తువులు



తెరిచి ఉన్న బీరువా

కోటవురట్ల : పండగ సందడిలో ఓ ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయారు. ఎవరూ లేని సమయంలో పట్టపగలే ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలివి. జి.సన్యాసిరాజుపాలెం గ్రామానికి చెందిన పంచదార్ల రామకృష్ణ దసరా పండగకు శనివారం తన అత్తారింటికి వడ్డాది వెళ్లాడు. ఇంటి దగ్గర ఉన్న అతని తల్లి నాగలక్ష్మి ఆదివారం ఉదయం పొలంలోకి వెళ్లింది. తిరిగి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి రాగా తలుపునకు వేసిన తాళం కప్ప కనిపించలేదు. తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఆమె ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. వెంటనే కుమారుడు రామకృష్ణకు ఫోన్‌లో విషయం చెప్పడంతో వడ్డాది నుంచి హుటాహుటిన ఇంటికి వచ్చి చూశారు. బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, సుమారు రూ.3 లక్షలు నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు రామకృష్ణ మాట్లాడుతూ మద్యం షాపు టెండరు కోసం రూ.5 లక్షలు అప్పు చేసి అందులో రూ.2 లక్షలు డీడీ తీసినట్టు తెలిపాడు. మిగిలిన డబ్బులు ఇంట్లో ఉంచగా, అవి చోరీకి గురైనట్టు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెంలో బురడ సత్తిబాబు(30) అనే యువకుడు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు. పరదేశిపాలేనికి చెందిన అమ్మ తల్లికి ముగ్గురు సంతానం. కుమార్తె, పెద్ద కుమారుడు బొబ్బిలిలో వారి కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు సత్తిబాబు ఏపీ ఫైబర్‌లో పనిచేస్తున్నాడు. శనివారం 12 గంటలకు దసరా పూజ పూర్తి చేసుకుని విశ్రాంతి కోసం తన పడక గదిలోకి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలవుతున్నా భోజనానికి రాకపోవడంతో పెద్ద కొడుకు పిలిచాడు. అయినా సమాధానం లేదు. తలుపు కొట్టినా ప్రయోజనం లేకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోనుంచి చూశాడు. సత్తిబాబు ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఉన్నట్టు గమనించి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి కిందకి దింపారు. అప్పటికే సత్తిబాబు మరణించాడు. తర్వాత అతని మొబైల్ పరిశీలించగా కొన్ని అనుమానకర సందేశాలు, వాయిస్ రికార్డులు ఉన్నట్లు గమనించారు. దీంతో మృతుడి తల్లి అమ్మతల్లి పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల లారీ కిందపడి యువకుడి మృతి

మాకవరపాలెం : కోళ్లలారీ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల మండలం జల్లూరుకు చెందిన లాలం స్వామి(25) విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. దసరా సందర్భంగా స్వగ్రామం వచ్చిన స్వామి మండలంలోని లచ్చన్నపాలెంలో ఉన్న తన స్నేహితుడి గంగాధర్ (25) దగ్గరకు శనివారం వచ్చాడు. వీరిద్దరూ రాత్రి లచ్చన్నపాలెం నుంచి మాకవరపాలెం మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. కొండల అగ్రహారం వద్ద గల నల్ల మారమ్మ ఆలయ సమీపానికి వచ్చేసరికి ముందు వెళుతున్న కోళ్ల లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో మోటార్ సైకిల్‌తో లారీ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో స్వామి లారీ టైరు కిందపడి దుర్మరణం చెందగా, గంగాధర్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్ నాయుడు ఆదివారం తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతురాలు మౌనిక

ఎస్.రాయవరం: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుని ఆదివారం మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన లంకా మౌనిక (26) భర్తతో కలిసి అడ్డురోడ్డులో నివాసం ఉంటున్నారు. భర్త అప్పలనాయుడు నక్కపల్లి హెటిరో సంస్థలో పని చేస్తున్నారు. గడిచిన శుక్రవారం మౌనికకు కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక ఉరి బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న మౌనికను అప్పడే ఇంటికి వచ్చిన భర్త అప్పలనాయుడు స్థానికుల సహాయంతో ముందుగా అడ్డురోడ్డు, ఆపై తుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు చెప్పారు. మృతురాలి తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మా ఊరిలో వైన్ షాపు వద్దు!



మధురవాడ వికలాంగుల కాలనీలో ధర్నా చేస్తున్న కాలనీ వాసులు



వైన్ షాపు వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

- మధురవాడ వికలాంగుల కాలనీలో స్థానికుల ఆందోళన

మధురవాడ: కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చేయడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జీవీఎంసీ 8వ వార్డు ముధురవాడ మిథిలాపురి వుడా కాలనీ సమీపంలోని వికలాంగుల కాలనీలో వైన్ షాపు ఏర్పాటు పట్ల స్థానికులు ఆదివారం ఆందోళనకు దిగారు. నివాసాల మధ్యలో, నివాస గృహంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సిద్ధం కావడంతో ఆదివారం కాలనీవాసులతోపాటు, పరిసర ప్రాంతాల ప్రజలు ధర్నా నిర్వహించారు. కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం, స్కూల్ బస్సులు ఆగే స్థలం వద్ద వైన్ షాపు పెట్టొద్దంటూ నిరసన తెలిపారు. మా ఊరికి వైన్ షాపు వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాలనీ ప్రజలు, విద్యార్థులు, మహిళలకు రక్షణ కరువవుతుందని, యువత చెడు మార్గం పట్టే అవకాశం ఉందని ఆక్షేపించారు. తక్షణమే వైన్ షాపు ఏర్పాటు ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కాలనీ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వెళ్తూ ప్రమాదం

- ఒకరి మృతి, ఏడుగురికి గాయాలు
- ఆగివున్న బస్సును ఢీకొన్న వ్యాన్



మృతురాలు అప్పలనర్సమ్మ(ఫైల్)

పరవాడ: విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భవానీ భక్తులతో వెళ్తున్న బస్సును వెనుక నుంచి వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. కొవ్వూరు పట్టణంలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఈ దుర్ఘటన వివరాలివి. కలపాక గ్రామానికి చెందిన భవానీ మాలధారులు 27 మంది దీక్షను విరమించేందుకు ఈ నెల 11న రాత్రి 8.30 గంటలకు ఓ ప్రైవేట్ బస్సులో విజయవాడ దుర్గమ్మ గుడికి బయలుదేరారు. శనివారం తెల్లవారు జామున 2.30 గంటలకు బస్సును కొవ్వూరు వంతెన సర్వీస్ రోడ్డు ఎంట్రన్స్‌లో నిలిపి డ్రైవర్ టైర్లను పరిశీలిస్తుండగా, ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన వ్యాను బలంగా ఢీ కొంది. దీంతో బస్సులో వెనుక సీటులో కూర్చున్న అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన పోలారపు అప్పలనర్సమ్మ(50) మృతి చెందగా, ఇంటర్ చదువుతున్న ఆమె మనుమరాలు గ్రీష్మ(16) తీవ్రంగా, కోడలు పోలారపు సునీత, కురం రోజా(నాగలక్ష్మి), భార్గవి, ఇందల చిన్నమ్మలు, ఇందల రామునాయుడు, వనుం కిషోర్‌లు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి, డిశ్చార్జి చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గ్రీష్మను మెరుగైన వైద్యం కోసం నగరంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్చారు. మృతురాలు అప్పలనర్సమ్మకు స్వగ్రామం కలపాకలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు అప్పలనర్సమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పలమనుమరాలు, కోడలికి గాయాలతో కలపాకలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

బీచ్‌రోడ్డు: అనారోగ్యం కారణంగా టీబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖైదీ శనివారం మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు. విశాఖ సెంట్రల్ జైల్‌లో ఖైదీగా ఉన్న లచ్చన్న(58) గత నెల 27న అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం టీబీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లచ్చన్న ఆరోగ్యం మరింతగా క్షీణించి, శనివారం మృతిచెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.